ప్రజలందరూ సీఎం జగన్ వెంటే

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- యండపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం


యండపల్లిలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: సమన్యాయం, సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ప్రజలందరూ ఉన్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. యండపల్లిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లలో ప్రభుత్వం పథకాల రూపంలో చేకూర్చిన లబ్ధిని వివరించారు. ఈ మేరకు గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పొందిన ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. పేదలు సఖంగా జీవించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలుపొందుతుందన్నారు. అనంతరం పంచాయతీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, సర్పంచ్ శ్రీలం పెద్దఅప్పారావు, ఉప సర్పంచ్ గంద్ర చిన్నారావు, ఎంపీటీసీ బర్రే రవి, యండపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు గుంద్ర రాజుబాబు, కన్వీనర్లు గుంద్ర జగ్గారావు, దాసరి సీత, వీరస్వామి, జ్యోతులు చక్రబ్బాయి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దొరబాబును కలిసిన జక్కంపూడి


దవులూరి దొరబాబుతో జక్కంపూడి గణేష్ తదితరులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల యుజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ బుధవారం సాయంత్రం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును స్థానిక పార్టీ క్యాంప్ కార్యాలయంలో కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్‌కు సత్కారం


చంద్రకుమార్‌ను సత్కరిస్తున్న దొరబాబు

పెద్దాపురం: సీనియర్ మున్సిపల్ లైసెన్స్‌డ్ సర్వేయర్ పచ్చిపాల చంద్రకుమార్ సేవలు పట్టణానికి ఎంతో అవసరమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సర్వేయర్‌గా సేవలందిస్తూ 40 ఏళ్లు పూర్తి చేసుకున్న చంద్రకుమార్‌ను కౌన్సిల్ ఆధ్వర్యంలో దొరబాబు సత్కరించారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధ్యక్షతన కౌన్సిల్, టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో దొరబాబు, మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు, కనకాల మహాలక్ష్మి, టీపీఓ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు.

గర్భిణులకు విశ్రాంతి అవసరం

కొత్తపల్లి: వేసవిలో గర్భిణులు పౌష్టికాహారం, విశ్రాంతి తీసుకోవాలని కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాన మౌనిక బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని ఎక్కువగా తీసుకోవాలని, పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవాలని ఆమె సూచించారు. విటమిన్ ఏ ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంతో పాటు విశ్రాంతిగా ఉండాలని తెలిపారు.

బ్యాడ్మింటన్ శిక్షణ

నాగమల్లితోట జంక్షన్: స్థానిక ఎస్ఆర్ఎంటి ఇండోర్ స్టేడియం ఆఫీసర్స్ క్లబ్‌లో స్టార్‌కిడ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో బ్యాడ్మింటన్ శిక్షణ అందిస్తున్నట్లు కోచ్ గణేష్ బుధవారం తెలిపారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల బాలురు, బాలికలు శిక్షణకు అర్హులన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఉడెన్, సింథటిక్ కోర్టులలో శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల వారు 97039 85953 నెంబరులో సంప్రదించాలని కోరారు. అలాగే ఏపీ లాన్‌టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఎంసీ కళాశాల ప్రాంగణంలో కాకినాడ టెన్నిస్ అకాడమీ టెన్నిస్ కోర్టులలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్నట్లు సంఘ కార్యదర్శి పీవీ రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆసక్తి గలవారు 94929 45555, 98852 22224 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆక్రమణలపై దృష్టి పెట్టండి


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు రాజా, భాస్కర్

- అధికారులకు కౌన్సిలర్ల ఆదేశం
- పెద్దాపురం మున్సిపల్ సమావేశం

పెద్దాపురం: పట్టణంలో మున్సిపల్ స్థలాల ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, టి.సత్యభాస్కర్ కౌన్సిల్‌లో ప్రస్తావించారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు మంగతాయారు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికారుల తీరును సభ్యులు ఎండగట్టారు. ఆన్‌లైన్‌లో కుళాయి పన్నుల డబుల్ ఎంట్రీతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సభ్యులు పేర్కొన్నారు. రేషన్ బియ్యం సరిగా అందడం లేదని, 24వ వార్డులో రామాలయం చెరువు గట్టు వీధి ప్రాంతం, ఎన్‌టిఆర్ నగర్ ప్రాంతాల్లో గోదావరి నీరు అందడం లేదని, రాజీవ్ కాలనీలో తాగునీటి పైప్‌లైన్లు పగిలాయని, పారిశుధ్య పనులు చేపట్టాలని కౌన్సిలర్లు పేరింశెట్టి అంబిక, కాపగంటి సౌందర్య, కనకదుర్గ సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కౌన్సిలర్ ఆరెళ్లి వీర్రాఘవులు మాట్లాడుతూ ట్రాక్టర్ల వేలం, కొత్త ట్రాక్టర్, జేసీజీ కొనుగోలుపై ప్రస్తావించగా కమిషనర్ జంపా సురేంద్ర స్పందిస్తూ చర్యలు చేపట్టామని, త్వరలోనే అవి పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ మెయిన్‌రోడ్డులో అంజనేయస్వామి గుడి వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో ప్రస్తుతం తాత్కాలికంగా రేకుల షెడ్ వేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న మున్సిపల్ ఖాళీస్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. పట్టణంలో ఎక్కడా మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా స్థలాలను గుర్తించి వాటికి రక్షణ కల్పించాలని వైస్ చైర్మన్ సాయి ప్రసాద్, చైర్ పర్సన్ తులసీ మంగతాయారులు ఆదేశించారు. వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, కమిషనర్ సురేంద్ర, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, టీపీఓ ఉమామహేశ్వరరావు, డీఈఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆర్ఓ చంద్రశేఖరం పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

- పిఠాపురం మండల సమావేశంలో సభ్యుల డిమాండ్

పిఠాపురం: గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధుల డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు అధ్యక్షతన బుధవారం మండల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖల పనితీరును వివరించారు. ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గోకివాడ సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పలు అక్రమాలు జరుగుతున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ తదితరులు

పెద్దాపురం: స్థానిక మహారాణి సత్రంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ప్రారంభించారు. ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం సాయి ప్రసాద్ పట్టణంలోని ఆయా సత్రాల వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. కౌన్సిలర్లు విడదాసరి రాజా, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పీఠాధిపతి ఆధ్వర్యంలో..

స్థానిక వర్జుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠం అధిపతి, జాతీయ అవార్డు గ్రహీత చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఆటో ద్వారా వీధివీధిన జన సంచారం ఉన్న చోట ప్రజలకు మజ్జిగను పంపిణీ చేశారు.

డ్వామా అధికారులకు శిక్షణ

సామర్లకోట: ఉపాధి హామీ పనులు మరింత నాణ్యంగా జరగడానికి డ్వామా అధికారులకు ఇస్తున్న శిక్షణ బుధవారం కూడా కొనసాగింది. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో పని చేస్తున్న డ్వామా ఏపీడీ, ఏపీఓ, ఏసీ, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నారు. గురువారంతో ఈ శిక్షణ ముగుస్తుంది. శిక్షణ కో ఆర్డినేటర్ జి.శ్రీహరి ఆధ్వర్యంలో డ్వామా రిసోర్స్ పర్సన్లు శ్వేత, సునీల్ ఎం. సత్యనారాయణ, ఎన్.నరేష్‌బాబు, ఎస్.శ్యామల, వి.సురేష్‌కుమార్, సీహెచ్‌వీవీ నరేష్, జీటీఎస్ సాగర్ ఈ శిక్షణ ఇచ్చారు.

నేడు పెద్దాపురం మండల సమావేశం

పెద్దాపురం: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

డీఎస్పీగా లతాకుమారి నియామకం



పెద్దాపురం: సబ్ డివిజనల్ డీఎస్పీగా కె.లతాకుమారి నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా పోలవరం డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఆమెకు పెద్దాపురం డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీఎస్పీగా కొనసాగిన కాకినాడ దిశ డీఎస్పీ సుంకర మురళీమోహన్ యథావిధిగా కాకినాడ దిశ డీఎస్పీగా కొనసాగనున్నారు. లతా కుమారి త్వరలో విధుల్లో చేరనున్నట్లు సిబ్బంది తెలిపారు.

ఉచిత పాలిసెట్ కోచింగ్


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి

పిఠాపురం: స్థానిక మహా రాజా ఫౌండేషన్ ఆదిత్య విద్యా సంస్థల సౌజన్యంతో పిఠాపురం ఆదిత్య స్కూల్లో నిర్వహిస్తున్న ఉచిత పాలిసెట్ కోచింగ్‌కు అనూహ్య స్పందన లభించినట్టు ఆ విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఉచిత కోచింగ్‌ను పరిశీలించి విద్యార్థులకు పాలిసెట్ విశిష్టతను వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఉత్తమమైన ఉపాధ్యాయ బృందంతో పాలిసెట్ కోచింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నియోజకవర్గం నుంచి రాజప్ప పోటీ

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా నిమ్మకాయల చినరాజప్ప పోటీ చేస్తారని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక రైతు భవనంలో సామాజిక మాధ్యమాల ద్వారా పార్టీ కార్యక్రమాల ప్రచారంపై కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.






500 మద్యం సీసాల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

సామర్లకోట: యానాం నుంచి సామర్లకోట వస్తున్న ఒక ఆటోలో 500 మద్యం సీసాలను బుధవారం సామర్లకోట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కె.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సామర్లకోట వస్తున్న ఆటోను పరిశీలించగా రెండు మూటల్లో మద్యం సీసాలు ఉన్నాయని, కొన్నింటిపై లేబుళ్లు ఉన్నాయని, కొన్నింటిపై లేవని, అవన్నీ యానాం నుంచి వస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. ఆటోను సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిపారు.

పాస్‌పోర్ట్ పోయినది

తేది.10-04-2023 ఉ॥ 11 గంటలకు వేట్లపాలెం నుండి సామర్లకోట బైక్ మీద వెళ్ళుచున్నప్పుడు మార్గ మధ్యలో పాస్‌పోర్ట్ పడి పోయినది. ఎవరికైనా దొరికినచో సామర్లకోట మండలం వేట్లపాలెం డో.నెం.20-52 నందు తెలియ పరచవలెను.
ఫోన్ నెం.74162 89347





అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలి


సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు

పెద్దాపురం: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు గ్రాట్యుటీ అమలు చేయాలని యూనియన్ అధ్యక్షురాలు దాడి బేబీ కోరారు. ఈ మేరకు బుధవారం సీడీపీఓ ఉషకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సూర్యకుమారి, నారాయణమ్మ, బూరమ్మ, రాణి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి వితరణ


సామర్లకోటలో ట్రాఫిక్ సిబ్బందిని సత్కరించిన కౌన్సిలర్ తదితరులు

సామర్లకోట: ఎండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులను ఎస్‌కె బాయ్స్ సత్కరించారు. స్థానిక ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఏఎస్సై రత్నంతో పాటు ట్రాఫిక్ సిబ్బందిని సత్కరించి టోపీలను, గ్లూకోజ్ ప్యాకెట్లను అందజేశారు. ఎస్‌కె బాయ్స్ గౌరవ అధ్యక్షుడు 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ సిబ్బంది చేస్తున్న సేవలు మరువలేనివని చెప్పారు. 22వ వార్డు కౌన్సిలర్ పితాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంఘ మిత్ర సామాజిక సేవ

మాధవపట్నంలోని సంఘ మిత్ర సంఘ సభ్యులు బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మాధవపట్నం నుంచి జమునానగర్ వెళ్లే రోడ్డు మార్జిన్‌లో పెరిగిపోయిన తుప్పలను జేసీబీ సాయంతో తొలగించారు. ఆ రోడ్డులో వీధిలైట్లు వెలిగేలా పంచాయతీ అధికారులతో చర్చించారు. అనంతరం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దాంతో జమునానగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు సంఘ మిత్ర సేవలను అభినందించారు. సంఘ మిత్ర అధ్యక్షుడు ఏఎండీ ఖాజా, చోటా బాబు, హేమంత్, గుత్తుల శివ తదితరులు పాల్గొన్నారు.